క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభస్వామి వ్రతం


వ్రతం ఆచరిస్తున్న మహిళలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తొలుత భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వ్రతం పూర్తి చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమణమ్మ

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మనుబోలు గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్లు, పాలు, ఆకు కూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణమ్మ, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయుడు అనంతయ్య, ఆశా వర్కర్ ప్రశాంతి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఇందుకూరుపేట : వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని లేబూరు, పున్నూరు గ్రామాల్లో మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి వరికోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. వెన్నుతీసే సమయంలో వర్షాలు కురవడం వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వరిలో వస్తున్న తెగుళ్లపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ సుమలత, రైతులు పాల్గొన్నారు.

వరిసాగులో డబుల్ ధమాకా

- కోతలు పూర్తయిన తర్వాత మళ్లీ చిగురిస్తున్న పంట
- రైతన్న ఆనందం


పేడూరులో రెండో దఫా ఏపుగా పెరుగుతున్న వరిపంట

తోటపల్లిగూడూరు : పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గుతూ ఆశాజనకంగా లేని వరిసాగుతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొన్ని ప్రాంతాల్లో ఊరట లభిస్తోంది. సాధారణంగా రైతులు వరిసాగులో ఓ సారి కోత కోసిన తర్వాత పొలాన్ని మరలా దుక్కులు చేసుకుని మరోసారి సాగుకు సిద్ధమవుతారు. అంతే తప్ప ఒకసారి వేసిన పంట రెండు దఫాలు పండే అవకాశం ఉండదు. కాని విచిత్రంగా ఈ దఫా కొన్ని ప్రాంతాల్లో కొందరి రైతులకు ఆ సదవకాశం లభిస్తోంది. మండలంలో ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తయింది. ఇటీవలే కోతలు పూర్తి చేసుకున్న రైతులు మరలా రబీ పంటకు సిద్ధపడుతున్నారు. కాగా ఖరీఫ్ కోతల అనంతరం ఇటీవల కురిసిన తేలికపాటు జల్లులకు కోతలు కోసిన మొదళ్లు మళ్లీ చిగురించి పైరు ఏపుగా పెరుగుతూ వెన్నులు తీస్తున్నాయి.

నాముతో దన్ను

సాధారణంగా మొదళ్లకు అక్కడక్కడా మొలకలు రావడం చిన్నపాటి వెన్నులు తీయడం జరుగుతుంటుంది. దానిని 'నాము' అని రైతులు పిలుస్తుంటారు. అధిక శాతం తరకలు ఉండే ఈ నామును గతంలో రైతులు పెద్దగా పట్టించుకునే వారు కాదు. కానీ ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా నాము వెన్నులు పుష్టిగా ఉంటూ పొలం మొత్తం మీద తొలి పంట మాదిరిగానే పండుతోంది. ఈ క్రమంలో సాధారణ పంటలా మరోదఫా పంట రైతుల చేతికొస్తోంది. ఎలాంటి మందులు పిచికారీ చేయకపోయినా, ఎరువులు వినియోగించకపోయినా మరో విడత పైరు ఏపుగా పెరుగుతుండడంపై స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పంటను బట్టి ఎకరాకు పుట్టి వరకు పండే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖర్చు లేకుండా మరోదఫా పంట చేతికి రావడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ విచిత్రమైన పరిణామం మండలంలోని పేడూరు, నరుకూరు, ఈదూరు, కోడూరు, వరిగొండ, వరకవిపూడి, కొత్తపాళెం ప్రాంతాల్లో ఉంటోంది.


కొత్తపాళెంలో పంటగా మారుతున్న నాము

అరుదైన పరిణామం

కోతలు కోసిన మొదళ్లు మళ్లీ చిగురించి మంచి పైరు రావడం అరుదైన పరిణామం. గతంలో ఇలాంటివి చోటుచేసుకున్న దాఖలాలు లేవు. పొలం సారవంతంగా ఉండడం, కోతలు పైపైనే కోయడం మూలంగా మొదళ్ల నుంచి మళ్లీ మొలకలు బలంగా పెరిగే అవకాశం ఏర్పడింది. ఏది ఏమైనా ఎందుకు పనికి రాని నాము రైతులకు ఖర్చులేని దిగుబడిని ఇవ్వడం సంతోషించదగ్గ పరిణామమే.

– రాజ్‌కుమార్, ఏడీఏ, ఇందుకూరుపేట

కొనసాగుతున్న నిమజ్జనోత్సవాలు


ముత్తుకూరు నుంచి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథుడు


మనుబోలు: నిమజ్జనానికి వెళ్తున్న బొజ్జ గణపయ్య

ముత్తుకూరు : వినాయక చవితి పండగ రోజున మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను మంగళవారం కూడా నిమజ్జనానికి తరలించారు. తప్పెట్లు, తాళాల మధ్య బాణసంచా కాలుస్తూ, యువకులు రంగులు చల్లుకుని నృత్యాలు చేస్తూ వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను ఊరేగించారు. నిమజ్జన నిమిత్తం కృష్ణపట్నం సముద్ర తీరానికి తరలించారు.

- మనుబోలు : మండలంలోని కేఆర్‌పురం పోలేరమ్మ గుడి మండపంలో ఏర్పాటు చేసిన గణనాథునికి సోమవారం రాత్రి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేశ్ లడ్డూకు వేలం వేయగా పాలెంపాటి చెంచయ్య రూ.28 వేలకు దక్కించుకున్నారు. వినాయకుని మెడలో వేసిన నగదు మాలను వేలం వేయగా పత్రా పవన్‌కుమార్ రూ.15.500కు దక్కించుకున్నారు. గ్రామోత్సవం అనంతరం గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో గణనాథుని నిమజ్జనం చేశారు.

హుండీ కానుకల లెక్కింపు

ఇందుకూరుపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ ఏడాది జూన్ 24 నుంచి హుండీ ద్వారా రూ.3,69,145లు వచ్చిందన్నారు. అన్నదాన కార్యక్రమానికి రూ.30,588లను భక్తులు సమర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుట్కా తెచ్చిన తంటా


గాయపడిన మహిళను హాస్పిటల్‌కు తరలిస్తున్న హైవే పోలీసులు


దెబ్బతిన్న తెలంగాణ ఆర్టీసీ బస్సు

- లారీ స్టీరింగ్ అదుపుతప్పి బస్సును ఢీ
- ఓ మహిళకు స్వల్ప గాయాలు
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కొడవలూరు : లారీ డ్రైవర్ గుట్కా అలవాటు ఓ ప్రమాదానికి కారణమైంది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న టీజీఎస్ఆర్టీసీ బస్సు హైవేపై వెళ్తూ మంగళవారం కొడవలూరు మండలం నాయుడుపాళెం వద్ద ముందు వెళ్తున్న లారీని క్రాస్ చేయబోయింది. ఇంతలో లారీ డ్రైవర్ గుట్కా వేసుకునేందుకు యత్నిస్తూ స్టీరింగ్‌ను వదిలారు. దీంతో లారీ అదుపుతప్పి పక్కకు తిరిగింది. అదే సమయంలో క్రాస్ చేయబోతున్న బస్సు ఎడమ వైపు ముందు భాగాన్ని లారీ వెనుక భాగం ఢీకొంది. అదే బస్సు కొంచెం ముందుకు వెళ్లుంటే పెద్ద ప్రమాదమే జరిగేది. కాగా బస్సులో 15 మంది ప్రయాణికులున్నారు. అందరూ సురక్షితంగానే బయట పడ్డప్పటికీ ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఆ మహిళను హైవే మొబైల్ పోలీసులు 108 వాహనంలో హాస్పిటల్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో టీజీఎస్ఆర్టీసీ బస్సు ఎడమ వైపు ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు


వెంకటాచలం : మొక్క నాటుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం : స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకోవాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవ 2024 ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవ ప్రచారం ఏడో సంవత్సరానికి చేరుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఇందులో పౌరులు, అధ్యాపకులు, విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. పరిశుభ్రతను కాపాడుకోవడం, మహాత్మ గాంధీ వారసత్వాన్ని గౌరవించడం కోసం ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, టి.వీరారెడ్డి, కోట సునీల్‌కుమార్, వెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన

ముత్తుకూరు : పారిశుద్ధ్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ లక్ష్మణకుమార్, ఈఓపీఆర్డీ హేమంత్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి అధికారులు, విద్యార్థులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు. అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఎంఈఓలు మధుసూదన, హేమసుందరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి ఆలయంలో మంగళవారం ఆలయ సిబ్బంది స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గర్భాలయంలో గోడలు, దర్శన క్యూలైన్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం చేపట్టినట్లు తెలియజేశారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతిరోజు స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ముత్తుకూరులో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గర్భాలయంలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న అధికారులు, కళాశాల సిబ్బంది

మనుబోలు : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఏపీఓ రాజమ్మ అన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. నానాటికీ పచ్చదనం తగ్గిపోతుండడంతో కాలుష్యం పెరుగుతోందన్నారు. కాలుష్య నివారణ కోసం పచ్చదనాన్ని పెంపొందించడమే మార్గమని తెలిపారు. అందువల్ల సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాల ఆవరణలో 100 కానుగ, నేరేడు మొక్కలు నాటించినట్లు తెలిపారు. అలాగే చెరుకుమూడి గ్రామంలో 110 నిమ్మ మొక్కలు, పిడూరు శ్మశానవాటికలో కూడా మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్, కార్యదర్శి ప్రసాద్, టీఏ గురప్ప, ఎఫ్ఏ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


జయంతిలో పాల్గొన్న సంఘ నాయకులు

మనుబోలు : మండల విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ కల్యాణ మండపంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకుడు ఆలూరు రాము ఆచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విశ్వకర్మల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు జగదీష్‌బాబు, ప్రసాద్ ఆచారి, చైతన్య, సుధాకర్, యుగంధర్, మల్లికార్జున, ప్రదీప్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలకై కృషి


వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న సోమిరెడ్డి

పొదలకూరు : రైతుల ప్రయోజనాల కోసం కృషి చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రభగిరిపట్నం పంచాయతీలో ఉన్న కిసాన్‌క్రాఫ్ట్ వ్యవసాయ పరికరాల తయారీ పరిశ్రమను సోమిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిసాన్‌క్రాఫ్ట్ ఫ్యాక్టరీలో తయారవుతున్న ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావడం గొప్ప విషయమన్నారు. కిసాన్‌క్రాఫ్ట్ చైర్మన్ రవీంద్ర అగర్వాల్ ద్వారా మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పీఎస్ సింగ్, ఇంటర్నేషనల్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ నికోలస్ గ్రాబ్లెర్, సీఈఓ చలసాని అజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పేదలందరికీ పక్కా ఇళ్లను అందిస్తాం

మనుబోలు : ఎన్టీఆర్ భరోసా కింద పేదలందరికీ పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇల్లు నిర్మించుకున్న ప్రశాంతి చేత అధికారులు మంగళవారం గృహ ప్రవేశం చేయించారు. అనంతరం ఇంటి తాళాలను లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు వేమా కిరణ్‌రెడ్డి, వెడిచర్ల దినేష్‌రెడ్డి, గుమ్మా దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

- ముత్తుకూరు : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన ఓ గృహాన్ని మంగళవారం అధికారులు ప్రారంభించారు. గత సంవత్సరం మండలంలో ఈ పథకం ద్వారా 1,180 పక్కా గృహాలు మంజూరయ్యాయి. ఒక గృహానికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. ఇందులో భాగంగా ముత్తుకూరు రాజమ్మ కాలనీలో పూర్తయిన పుచ్చలపల్లి సుబ్బమ్మ గృహాన్ని ఇన్‌చార్జి డీఈఈ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇంటి తాళాలు అప్పగించారు. ఎంపీడీఓ లక్ష్మణకుమార్, ఏపీఎం, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సాగు ఖర్చులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఆత్మ పీడీ శివన్నారాయణ

కోవూరు : రైతులకు సాగు ఖర్చులపై అవగాహన ఉండాలని ఆత్మ పీడీ జి.శివన్నారాయణ అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయ సహాయకుల అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ సలహాలు పాటించకుండా తమ ఇష్టానుసారంగా పురుగు మందులను వాడడం మంచిది కాదన్నారు. దీనివల్ల సాగు ఖర్చులు పెరిగి మిత్ర పురుగులు నశించి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా మారుతున్న కాలానికి తగ్గట్లు రైతుల్లో కూడా నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్సీ వ్యవసాయ సంచాలకులు సి.మారుతీదేవి, సహాయ వ్యవసాయ సంచాలకుడు శేషగిరి, వివిధ మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం అన్నారు. పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మినీ సైన్స్‌ల్యాబ్‌ను మంగళవారం ఎంఈఓలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమర్థనం ట్రస్ట్ సహకారంతో పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశోధనలు చేయడానికి అనువుగా ల్యాబ్‌లో అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. అనంతరం హెర్బాలైఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జ్యూట్ సంచులు అందజేశారు. సమర్థనం, హెర్బాలైఫ్ సభ్యులను ఎంఈఓలతో కలిసి ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

కొడవలూరు : కొడవలూరు కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులందరికీ కొడవలూరు హైస్కూల్ రిటైర్డ్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు విద్యాసామగ్రిని వితరణ చేశారు. కాంప్లెక్స్ పరిధిలోని హైస్కూళ్ల తెలుగు ఉపాధ్యాయులకు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కొడవలూరు హైస్కూల్‌లో వేర్వేరుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండడంతో వీరికి ఎంఈఓ జి.వసంతకుమారి చేతుల మీదుగా మంగళవారం నోట్‌బుక్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.అంకయ్య, రిసోర్స్ పర్సన్‌లు హరిబాబు, ఎ.సంధ్యా, టి.వెంకటేశ్వర్లు, టి.రమేష్, ఎ.బలరామయ్య, డి.నీరజ, సీఆర్‌ఎంటీ జె.పెంచలరావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం


మనుబోలు : మాత్రలు వేస్తున్న సీహెచ్‌ఓ రాజయ్య

కొడవలూరు : నులి పురుగుల నివారణతో ఆరోగ్యంగా ఉండొచ్చని, డీవార్మింగ్ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా మంగళవారం డీవార్మింగ్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవార్మింగ్ మాత్రలు వాడడం వల్ల పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా ఉంటుందన్నారు. 2 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన వారికి విధిగా డీవార్మింగ్ మాత్రలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, ఏఎన్‌ఎం శేషుబాయి, సీఆర్‌ఎంటీ జె.పెంచలరావు, మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట : మండలంలోని ఆదెమ్మసత్రం గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్ నులి పురుగులతో కలిగే అనర్థాలను వివరించారు. చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, సూపర్‌వైజర్ రమ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.
- మనుబోలు : మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో డీవార్మింగ్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. రెండేళ్ల నుంచి 19 సంవత్సరాల్లోపు వారికి మాత్రలు పంపిణీ చేస్తామని మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ రాజయ్య తెలిపారు. మొదటి రోజు 96 శాతం మందికి మాత్రలు వేశామన్నారు. మిగిలిన వారికి బుధ, గురువారాల్లో కూడా అందిస్తామన్నారు. మండలంలో రెండేళ్ల నుంచి 18 సంవత్సరాల మధ్య మొత్తం 7,433 మంది ఉండగా తొలిరోజు 7,129 మందికి (96 శాతం) మాత్రలు వేసినట్లు తెలిపారు.
- పొదలకూరు : జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలోని ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు మాత్రలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు ఎం.రాధాకుమారి, సుమాంజలి, హెచ్‌ఎం పెంచల నర్సయ్య పాల్గొన్నారు.
- విడవలూరు : పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపల్ బి.సుజాత అన్నారు. స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఎస్.చామంతి కళాశాలలోని విద్యార్థులకు డీ వార్మింగ్ మందులను అందజేసి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ మాస్టర్ డి.ఈశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఇందుకూరుపేట : ఆదెమ్మసత్రం జెడ్పీ పాఠశాలలో..


కొడవలూరు : విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం


పొదలకూరులో..